# బూర్జువా మహిళా ఉద్యమం

క్లారాజట్కిన్

*మహిళలు వర్గబానిసత్వం నుండి, లైంగిక బానిసత్వం నుండి విముక్తి చెందడం సాధ్యంకాని పెట్టుబడిదారీ వ్యవస్థనే బూర్జువా మహిళా ఉద్యమం రక్షించపూనుకొందని; బూర్జువా-కార్మికవర్గాల మధ్య అధిగమించ వీలుగాని వర్గ వైరుధ్యాలపై బూర్జువావర్గ వ్యవస్థ నిర్మితమైందని; దోపిడీదారులైన పాలకులు ఒకవైపు, దోపిడీకి గురవుతున్న పాలితులు మరోవైపు విభజించబడి వుండగా ఈ రెండు వర్గాలలో దేనికి చెందుతారన్న దానిపై ఆధారపడి స్త్రీల జీవిత విధానం నిర్ణయమవుతుందిగానీ, వారి స్త్రీత్వంపై ఆధారపడి కాదని అంతర్జాతీయ కమ్యూనిస్టు, మహిళా ఉద్యమనేత క్లారాజట్కిన్ బూర్జువా మహిళా ఉద్యమాల్ని మార్క్సిస్టు దృక్కోణంలో వివరించారు. బూర్జువా మహిళా ఉద్యమానికున్న పరిమితులను విశ్లేషించారు.*

**- సంపాదకుడు**

**బూర్జువా** మహిళా ఉద్యమం (మొత్తంమీద ఆధునిక మహిళా వుద్యమం) పెట్టుబడిదారీ తరహా ఉత్పత్తి విధానం నుండే పుట్టుకు వచ్చింది. స్త్రీ, పురుషుల మధ్య సంపూర్ణ సాంఘిక సమానత్వ దిశలో కృషి జరిపేటందుకు పెట్టుబడిదారీ విధానమే ఆర్థిక పునాదిని వేసింది. ప్రధానమైన చోదకశక్తిగా యీ కృషి వెనుక నిలిచింది. స్త్రీలు, పిల్లలు పాల్గొనే గృహోత్పాదక కార్యకలాపాలకు అనుగుణ్యమైన సామాజిక పరిస్థితులను బూర్జువా సమాజానికి పునాదిగా వున్న పెట్టుబడిదారీ తరహా ఉత్పత్తి విధానం ధ్వంసమొనర్చింది. తొలినాటి సామాజిక రూపాల సాంఘిక స్థితిగతుల స్వభావం మహిళల జీవితాన్ని నిర్దేశించింది. స్త్రీలను పరాధీనులను చేసి పురుషపెత్తనాన్ని నెలకొల్పింది. ప్రాచీన కాలానికి చెందిన స్త్రీలు బహుముఖమైన గృహోత్పత్తి కార్యకలాపాలలో తలమునకలై వుండేవారు. ఏది యేమైనప్పటికీ ఆధునిక నగరాలు అభివృద్ధి చెందటంతో కుటుంబ పరిధిలోని వారి ఉత్పత్తి కార్యకలాపాలు తొలగిపోయాయి. వారికి ముఖ్యవనరుగా వుండిన వ్యవసాయక ముడిసరుకులు కూడా చేయిదాటి పోయాయి. ఉత్పత్తి సాధనాలు, ఇంజన్లు, యాంత్రిక పరికరాలు, అదేవిధంగా శాస్త్రవిజ్ఞానాన్ని అన్వయించిన కారణంగా ఆర్థిక నైపుణ్యంలోను, శాస్త్ర విజ్ఞానంలోను సంభవించిన పురోగతి యీ ఆకస్మిక మార్పులకు కారణమైంది. బూర్జువా సమాజంలోని యీ రకమైన మార్పులు ఆధునిక మహిళా వుద్యమానికి శ్రీకారాన్ని చుట్టాయి. ఈ రకమైన మార్పులతో మహిళా ఉద్యమం ఒక్కొక్క అడుగే ముందుకు కదిలింది. చట్టపరమైన, సామాజికమైన పురుష పెత్తనంనుండి తమను తాము విముక్తి చేసుకొనేందుకు, స్త్రీ, పురుషుల మధ్య సామాజిక, మానవీయ సమానతను సాధించేటందుకు యీ ఉద్యమం కొనసాగింది.

చట్టపరంగానూ, సామాజికంగానూ పురుషులతో పాటు స్త్రీలకు సంపూర్ణ సమానత్వ స్థాయినీ, స్థానాన్ని కల్పించాలన్న మౌలిక డిమాండ్‌ను యీ బూర్జువా మహిళా వుద్యమం లేవనెత్తింది. ఈ రకమైన డిమాండ్‌ను నెరవేర్చడమంటే ఏ రకమైన మినహాయింపులూ లేకుండా మహిళలందరికీ విముక్తిని కల్పించటమేనని యీ ఉద్యమ నాయకులు పేర్కొన్నారు. అయితే యిందులో వాస్తవంలేదు. సంపూర్ణమైన సామాజిక, మానవీయ స్వేచ్ఛకుగానీ లేదా బానిసత్వానికిగానీ బూర్జువా సమాజమే కీలకమన్న విషయాన్ని గుర్తించడంలో ఓటుహక్కు వుద్యమవాదులు విఫలమయ్యారు, లేదా గుర్తించటానికి నిరాకరించారు. పెట్టుబడిదారీ తరహా ఉత్పత్తి విధానాన్ని పునాదిగా చేసుకొని, బూర్జువా – కార్మికవర్గాల మధ్య అధిగమించ వీలుకాని వర్గవైరుధ్యాలపై నిర్మితమైన బూర్జువా సమాజం ఒకవైపున దోపిడీదారులు పాలకులుగానూ; మరోవైపున దోపిడీకి గురవుతున్నవారు పాలితులుగానూ విభజితమైంది. ఈ రెండు వర్గాలలో దేనికి చెందుతారన్న దానిపై ఆధారపడి స్త్రీల జీవిత విధానం నిర్ణయమవుతుంది. అంతేగాని వారి స్త్రీత్వం దీనికి కారణం కాదు.

స్త్రీలెదుర్కొంటున్న యీ పరిస్థితికి మౌలికమైన వర్గవైరుధ్యాలే అసలు కారణం. ప్రత్యేకించి బూర్జువా సమాజంలో అంటే జీవనాధారానికీ, సాంస్కృతిక పురోగమనానికీ ఆవశ్యకమైన వస్తూత్పత్తి సాధనాలపై ప్రైవేట్ యాజమాన్యం వుండటం. వర్గ బానిసత్వానికి వున్న ఈ మౌలిక కారణాన్ని తొలగించగలిగితే దోపిడీకి గురవుతున్న వర్గానికీ, అదేవిధంగా అణగారిన తరగతులకు చెందిన మహిళలు (మొత్తం స్త్రీలలో ఇలాంటి వారే అత్యధికంగా వున్నారు) నిజమైన అర్థంలో సంపూర్ణమైన విముక్తిని, సమానత్వాన్ని పొందుతారు. ఎప్పుడైతే ఆధునిక ఉత్పత్తి సాధనాలు సామాజిక స్వభావానికి అనుగుణ్యంగా మారతాయో, ఎప్పుడైతే వ్యక్తుల లేదా చిన్నచిన్న బృందాల ప్రైవేట్ ఆస్తి సామాజికంగా రూపాంతరం చెందుతుందో, ఎప్పుడైతే వస్తూత్పత్తికీ, దాని పాదార్థిక, సాంస్కృతిక ఫలాల పంపిణీకి అవసరమయ్యే స్థితిగతులను సమాజం నియంత్రిస్తుందో అప్పుడు మాత్రమే విముక్తి, సమానత్వం సాధ్యపడుతుంది. ఈ రకమైన విప్లవీకృత ఆర్థిక పునాదులపై మాత్రమే వినూత్నమైన, ఉన్నతమైన సామాజిక రూపాలు అభివృద్ధిచెందుతాయి. అప్పుడు మాత్రమే పురోగమనానికీ, సంపూర్ణ మానవీయ కార్యకలాపాలకు యావత్ స్త్రీజాతికీ నిజమైన స్వేచ్ఛ లభిస్తుంది. లైంగిక తారతమ్యాలతో నిమిత్తం లేకుండా దోపిడీకి గురవుతున్న ప్రజలందరూ సంఘటిత విప్లవ వర్గపోరాటం సాగించినప్పుడే యీ లక్ష్యం

సిద్ధిస్తుంది. అంతేగాని వర్గ తారతమ్యాలను పరిగణలోకి తీసుకోకుండా పురుషాధికత్యతకు వ్యతిరేకంగా స్త్రీలు సాగించే పోరాటం యీ లక్ష్యాన్ని సాధించలేదు.

వాస్తవాలనుండీ, అనుభవాలనుండీ ఆవిర్భవించిన ఈ శాస్త్రీయ అవగాహనకు విరుద్ధంగా, స్త్రీ విముక్తి కోసం కుటుంబంలోను, రాజ్యవ్యవస్థలోను, సమాజంలోను పురుషుడు పొందుతున్న ప్రత్యేక సౌకర్యాలకు, ఆధిపత్యాలకు వ్యతిరేకంగా పోరాటం సాగించాలని చెప్పడం వరకే బూర్జువా మహిళా ఉద్యమం పరిమితమవుతున్నది. ఈ పరిమితి అనేది బూర్జువా మహిళా ఉద్యమపు సార్వత్రిక లక్షణంగా వుంది. స్త్రీ ఓటుహక్కుకోసం పోరాడేవారు అతి విస్తృతము, సంక్లిష్టము అయిన స్త్రీ విముక్తి సమస్యను, బహుముఖ సామాజిక పరిస్థితులను దృష్టిలో వుంచుకొని చూడటం లేదు. పైగా బూర్జువా సమాజపు ప్రయోజనాలపట్ల మక్కువ చూపుతున్నారు. వ్యక్తిగత ఆస్తి ప్రాతిపదికపై, దానితో ముడిపడి స్త్రీల లైంగిక బానిసత్వం పెరుగుతూ వచ్చిందని చరిత్ర మనకు తెలియచెప్తున్న కారణంగా వీరి భావజాలాన్నీ, చర్యలనూ ప్రతిఘటించవలసి వుంది.

స్త్రీపై పురుషుడి పెత్తనాన్ని, అధికారాన్ని పటాపంచలు చేసే లక్ష్యంతో బూర్జువా మహిళా ఉద్యమం లేవనెత్తిన ప్రధానమైన డిమాండ్లు ఈ క్రింది విధంగా వున్నాయి. వివాహ విచ్ఛేదనంలో సమాన హక్కులు; సంతానంపై స్త్రీ, పురుషులకు సమానహక్కు; లైంగిక విషయాలలో ఒకేరకమైన నీతి; తన ఆస్తిని అమ్ముకోవడంలోనూ, సంపాదనపైనా, ఆదాయంపైనా స్త్రీకి హక్కు; వృత్తి శిక్షణకు, కార్యకలాపాలకు హామీతో కూడిన స్వాతంత్ర్యం; సామాజిక జీవనంలోని అన్ని రంగాలలోను ఉభయులకు కార్యకలాపాలు సాగించే స్వాతంత్ర్యానికి హక్కు : రాజ్య వ్యవస్థలోనూ, దాని అంగాలలోనూ సంపూర్ణ రాజకీయ సమానత్వం తదితరమైనవి. ఓటుహక్కు వుద్యమకారులు లేవనెత్తిన డిమాండ్లు శ్రామిక మహిళలకు కూడా విలువైనవే ననటంలో వివాదమేమీ లేదు. మగవాళ్లతోపాటుగానే ఆడవాళ్ళకు కూడా సమాన సామర్థ్యమున్నదని, సమాన హక్కులు వుండాలని గుర్తించటం ప్రత్యేకించి చెప్పుకోదగిన అంశం. ఇది ఎలా వున్నప్పటికీ మహిళల లైంగిక బానిసత్వాన్ని తగ్గించటానికి, రద్దుచేయటానికి వుద్దేశించిన యీ సంస్కరణలు పరిమితమైనవే. వాస్తవానికి బూర్జువా సమాజంలోని అత్యధిక మహిళల విషయంలో యివి ఉపయోగకరం కాదు. ఎందుకంటే దోపిడీకి గురవతున్న వారి ఆత్మను, శరీరాన్ని కట్టివేసి వుంచుతున్న వర్గ బానిసత్వం యథావిధిగానే కొనసాగు తున్నది. బూర్జువా మహిళా ఉద్యమం సాధించిన విజయాలు ఆస్తిపర, పాలక, దోపిడీ వర్గాలకు చెంది ఆర్థికస్వేచ్ఛ కలిగిన మహిళలకు మాత్రమే అనుకూలంగా వుంటాయి.

లైంగిక బానిసత్వానికి వర్గ బానిసత్వం ప్రాతిపదిక నేర్పరిచి తీవ్రతరం చేస్తున్నప్పటికీ అత్యధిక మహిళలు అనుభవిస్తున్న వర్గబానిసత్వానికి వ్యతిరేకంగా యీ వుద్యమకారులు పనిచేయడంలేదు. అంతేకాక తమ యజమానులకు, తమను పీడించే వారికి వ్యతిరేకంగా అణగారిన జనాలు సాగించవలసి వున్న వర్గపోరాటాన్ని వారు మౌలికంగానే త్రోసిపుచ్చుతున్నారు. బూర్జువా మహిళా వుద్యమం వేళ్ళు బూర్జువా సమాజంలో బలంగా నాటుకొని వున్నాయి. పైగా కార్మికవర్గం వుద్యమించటాన్ని వ్యతిరేకిస్తూ బూర్జువా సమాజ రక్షణకు నిలబడింది. స్త్రీలను పురుష బానిసలుగా మార్చిన శాసనపరమైన, సామాజికపరమైన సంకెళ్ళను కాస్త వదులుచేసేలా బూర్జువా సమాజాన్ని సంస్కరించాలని కోరుతున్నారు. కార్మికవర్గం అధికారాన్ని హస్తగతం చేసుకోవటం ద్వారా మహిళలను విముక్తి చేయాలన్న లక్ష్యం కలిగిన విప్లవంపట్ల కాలక్రమంలో యీ వుద్యమకారులలో అత్యధికులు ఎలాంటి అరమరికలు లేకుండా తీవ్ర శత్రుత్వాన్ని ప్రదర్శించారు. కనీసం తమ వుద్యమ ప్రారంభదినాలలో వలే తటస్థంగానైనా వుండలేదు. ఆ రకంగా బూర్జువా మహిళా వుద్యమం స్త్రీ విముక్తికి మార్గదర్శి కాలేకపోయింది. స్వాతంత్ర్యాభిలాష కలిగిన యావత్ స్త్రీలకు ప్రాతినిధ్యం వహించలేక పోయింది. ఫ్యూడల్ సమాజంలోని పాలకవర్గాలను కూలద్రోసి, బలీయమైన రాజకీయ శక్తిగా నిలదొక్కు కోవటానికి దారితీసిన బూర్జువా స్వాతంత్ర్య పోరాటానికి యీ మహిళా వుద్యమం చిట్టచివరి బిడ్డ. ఫ్యూడల్ ప్రభువుల అణచివేతకు, దోపిడీకి గురైనవారందరినీ ఏ పేరుమీద అయితే బూర్జువాలు పోరాటంలోకి తీసుకువచ్చారో ఆ సూత్రాలకు చట్టబద్ధత కలిగించటమే యీ మహిళా వుద్యమ లక్ష్యంగా వున్నది. లాంఛన ప్రాయమైన బూర్జువా ప్రజాస్వామ్య సూత్రాలేమిటంటే విశ్వవ్యాప్త మానవహక్కుల అభివ్యక్తీకరణగా బూర్జువా సమాజంలోని సభ్యులందరి సమానతనూ, సమాన హక్కులనూ చట్టబద్ధంగా గుర్తించటం.

పదిహేడవ శతాబ్ది నాటి ఇంగ్లండ్ బూర్జువా అధికారానికి తలుపులు తెరచిన వారి భావజాలము పూర్తిగా మతభావాలతో నిండి వుంది. విశ్వవ్యాప్త మానవహక్కులు భగవంతుని వరప్రసాదంగా వారు భావించారు. ఒక శతాబ్దం అనంతరం ఫ్రాన్స్‌లో ఫ్యూడల్ ప్రభువులకు వ్యతిరేకంగా అధికారం కోసం పోరాటాన్ని నడిపిన బూర్జువాల నాయకత్వానికి స్ఫూర్తినిచ్చిన భౌతికవాద ప్రాపంచిక దృక్పథం కలిగిన తత్వశాస్త్రం ప్రకారం, యీ విశ్వవ్యాప్త మానవహక్కులు సహజసిద్ధమైన హక్కులుగా భావించబడ్డాయి. పుట్టుకతో నిమిత్తం లేకుండా సమాజంలోని ప్రతి ఒక్కరికీ యివి వుండాలని వీరు భావించారు. ఈ రెండు దృక్పథాలను ఆధారం చేసుకొని 'విశ్వవ్యాప్త మానవహక్కు'గా స్త్రీ సమానత్వాన్ని అంతర్జాతీయ మహిళా వుద్యమం నిరవధికంగా డిమాండ్ చేస్తున్నది. భగవంతుని వరప్రసాదమైన సహజహక్కుగా భావించబడుతున్న యీ హక్కును అబలలైన స్త్రీల నుంచి బలంగలిగిన పురుషులు లాగివేశారని వీరి భావన. సోషలిస్టు బోధలు, సోషలిస్టు విమర్శల ప్రభావంతో మాత్రమే బూర్జువా మహిళా వుద్యమం మారుతున్న మహిళల జీవన, పని పరిస్థితుల ప్రాతిపదికపై అసంపూర్ణంగానే అయినప్పటికీ క్రమక్రమేణా తన డిమాండ్లను సమర్థించుకోవటం

ప్రారంభించింది. బూర్జువా సమాజంలో ప్రకటిత "ప్రజాస్వామ్య సూత్రాలు" వాస్తవంలో బూర్జువా నియంతృత్వంగా పనిచేస్తాయని, "విశ్వమానవ హక్కులు" యథార్థంలో ఆస్తిపర వర్గాలకు మాత్రమే అందుబాటులో వుంటాయన్న నిజాన్ని యీ వుద్యమం పట్టించుకోలేదు.

పదునెన్మిదవ శతాబ్ది చివరినాటి ఫ్రెంచ్ విప్లవంలో తన మూలాలు వున్నట్లుగా బూర్జువా మహిళా వుద్యమం గుర్తిస్తుంది. ఈ మహత్తర ఘటనలు సృష్టించిన ప్రచండ కోపాగ్నుల మధ్య కుటుంబంలోను, సమాజంలోను, రాజ్యవ్యవస్థలోను స్త్రీలకు సంపూర్ణ సమానత్వం వుండాలన్న డిమాండ్‌ను సంఘటిత, సమరశీల మహిళలు లేవనెత్తారు. విశ్వ మానవహక్కుల ప్రాధాన్యతను విశిష్టమైన రీతిలో ఒలెంపి డి గౌజెస్ యిలా ప్రకటించారు. "ఉరికంబాన్ని ఎక్కు హక్కు స్త్రీకి వున్నప్పుడు, స్పీకర్ వేదికకు ఎక్కు హక్కు కూడా ఆమెకు వుండాలి". విప్లవ పరిరక్షణకు, అసంఖ్యాక మహిళలు అనేక త్యాగాలు చేసి, విజయాలు సాధించినప్పటికీ విశ్వమానవ హక్కులు స్త్రీల హక్కులుగా రూపొందలేదు. ఈ చర్యను చేపట్టటానికి వీలుగా శైశవ దశలోని పెట్టుబడిదారీ విధానం బూర్జువా సమాజాన్ని విప్లవీకరించలేదు. అంతేగాక విశ్వమానవ హక్కులతో తులతూగేలా మహిళల హక్కుల స్వభావం ఎదగలేదని కరాఖండిగా చెప్పేటంత తీవ్రదశకూ, పరిణతికీ బూర్జువా, కార్మికవర్గాల మధ్య వర్గ వైరుధ్యాలు అభివృద్ధి చెందలేదు. ఇదేవిధంగా వారికేమి లేదో సూచించేలా వారు చేయలేకపోయారు. అంటే యావత్ స్త్రీజాతి సంపూర్ణ విమోచనను కోరలేదు.

పందొమ్మిదవ శతాబ్దపు ప్రథమార్ధంలో ఫ్రాన్స్, జర్మనీలలో విప్లవాలు, ఇంగ్లండ్‌లో రాజకీయ, సాంఘిక పోరాటాలు, ప్రత్యేకించి బానిసత్వ రద్దుకోసం అమెరికాలో దక్షిణ ప్రాంతపు ఫ్యూడల్ రాష్ట్రాలతో, ఉత్తర ప్రాంతపు పారిశ్రామిక రాష్ట్రాలు ఘర్షణకు దిగాయి. వీటితోపాటే స్త్రీ సమానత్వాన్ని ఎలుగెత్తి చాటేవారు కూడా ప్రాదుర్భవించారు. అరకొరగా సంఘటితమైన మహిళా బృందాలు యీ డిమాండ్‌ను ముందుకు తెచ్చాయి. ఫ్రాన్స్, జర్మనీలలో కొంతమంది తొలితరం నాయకులు స్త్రీ విమోచననేకాక శ్రామిక మహిళల జీవన పరిస్థితుల మెరుగుదలకు కూడా కృషిచేశారు. అయితే కార్మికవర్గ దృక్పథం నుంచి వీరీపని చేయలేదు. మానవత్వం పేరుతో తమ 'పేద సోదరి'కి పైనుంచి సహాయం అందించాలని వారు భావించారు. కానీ దిగువస్థాయిలోనే తమకోసం తాము పోరాటం చేయాలన్న పిలుపును యివ్వటానికి వారు సిద్ధంకాలేదు. ఫ్రాన్స్, జర్మనీలలో సాగిన విప్లవాలలో (1848 జూన్‌లో పారిస్‌లో సంభవించిన పోరాటం) శ్రామికుల సమైక్య సమరశీల వర్గంగా ముందుకు రావడంతో "మర్యాదస్తులైన బూర్జువాలు" భయపడిపోయారు. పెట్టుబడిదారీ విధానం విజయభేరి మ్రోగిస్తూ ముందుకు సాగిపోతున్న అన్ని దేశాలలోను దోపిడీదారులకూ, దోపిడీకి గురయ్యేవారికీ మధ్య వర్గ వైరుధ్యాలు తీవ్రమయ్యాయి. కార్మికవర్గం చురుకైన, సమైక్య, రాజకీయ సంఘటిత విప్లవశక్తిగా తనను తాను సమన్వయం చేసుకోవడం ప్రారంభించింది. బూర్జువాలు తొలుత యీ శక్తిని గుర్తించి తదనంతరం విచ్ఛిన్నం చేయటానికి ప్రయత్నించారు. అంతేకాదు విప్లవతత్వాన్ని విడనాడి అభ్యుదయ నిరోధకంగా రూపుదాల్చి క్రమక్రమేణా విప్లవ ప్రతీఘాత వర్గంగా తయారైంది.

ఈ పరిణామాలలో బూర్జువా మహిళా వుద్యమం చురుకైన పాత్రనే నిర్వహించింది. పాత నుడికారాల ముసుగులో ఎంతోకాలం దాగలేకపోయిన దీని వర్గతత్వం అంతకంతకూ స్పష్టంగా వెల్లడైంది. శ్రామిక మహిళలకు చట్టబద్ధ రక్షణ, స్త్రీల ఓటుహక్కుకు సంబంధించి యిది చేపట్టిన వైఖరిలో యీ విషయం మరింత స్పష్టమైంది. 'పై వర్గాల మహిళల ఓటుహక్కు'కే యిది పరిమితమైంది. ఏది ఏమైనప్పటికీ దీనితో బూర్జువా మహిళా వుద్యమం 'మరింత మధ్యేవాదం'గానూ, "మరింత హేతుబద్ధం"గానూ మారిపోయింది. బూజుపట్టిన దురవగాహనలతో అది రాజీ పడింది. స్త్రీ సమానత్వ సమస్యకన్నా బూర్జువా వర్గప్రయోజనాలకే ప్రాధాన్యత నిచ్చింది. స్త్రీల ఓటుహక్కుకోసం సాగిన పోరాటంలో అమెరికా, ఇంగ్లండ్ దేశాలలో ఆత్మ త్యాగ అరాచక ఓటుహక్కు వుద్యమకారులు తీవ్రవాద ఎత్తుగడలను చేపట్టారు. ఓటుహక్కు వుద్యమ వర్గస్వభావాన్ని యీ ఎత్తుగడలు తెలియజేస్తున్నాయి. కాని వీరు దానిని మార్చలేకపోయారు. అంతర్జాతీయ సోదరీతత్వం గురించిన వుల్లాసకరమైన పాటలు పాడుతూ స్వాతంత్ర్యం గురించి జాజ్వల్యమానమైన ప్రేమను ప్రదర్శించినప్పటికీ ఎక్కువభాగం బూర్జువా మహిళాసంఘాలు 'మాతృదేశ రక్షణ' పేరుతో దురహంకార జాతీయవాదుల వలెనూ, సామ్రాజ్యవాదులు నాలుగేళ్ళపాటు సాగించిన మారణకాండను సమర్థించాయి.

1917 అక్టోబర్ విప్లవ ప్రభావంతో అంటే రష్యన్ కార్మికవర్గం, ప్రపంచ కార్మికవర్గ విప్లవ జేగంటలు మ్రోగించినప్పుడు పెట్టుబడిదారీ, వలస, అర్ధవలస దేశాలలోని అణగారిన, దోపిడీకి గురవుతున్న జనం పోరాటానికి సన్నద్ధమయ్యారు. వారిని బంధించి వుంచిన ఉక్కు సంకెళ్ళు గలగలలాడాయి. 1917 తరువాత బూర్జువా సామాజిక వ్యవస్థను పదిలపరచి పరిరక్షించడమే బూర్జువా మహిళా వుద్యమ ప్రధాన లక్ష్యంగా మారిపోయింది. ఏ వ్యవస్థలోనైతే మహిళలు వర్గ బానిసత్వం నుండి, లైంగిక బానిసత్వం నుండి విముక్తి చెందడం సాధ్యంకాదో ఆ వ్యవస్థనే యీ వుద్యమం రక్షించబూనుకొన్నది. స్త్రీలకు సంబంధించి సంపూర్ణ సామాజిక, మానవీయ సమానత్వం కేవలం కాగితాలకే పరిమితం కాకుండా యథార్థానికి కార్యాచరణ రూపాన్ని యిచ్చే అత్యున్నత ఆర్థిక, సామాజిక రూపాలను కార్మికవర్గం సృష్టించిన విషయాన్ని యు.ఎస్.ఎస్.ఆర్.లోని రాజ్యాంగము, సోషలిస్టు తరహా అభివృద్ధి రుజువు చేసిన నేపథ్యంలో యీ పరిణామం సంభవించింది. బూర్జువా మహిళా వుద్యమ విప్లవ ప్రతీఘాత కార్యకలాపాలకు ఒకే ఒక మినహాయింపు యేమిటంటే స్వాతంత్ర్యం – శాంతికోసం ఏర్పడిన అంతర్జాతీయ మహిళాలీగ్. విప్లవకర, పోరాట కార్మికవర్గము, దాని నియంతృత్వము బూర్జువా సామాజిక వ్యవస్థను కూలదోస్తుందని విన్నప్పటికీ లీగ్ అగ్రనాయకత్వం

ఏమాత్రం చలించలేదు. వీరి అవగాహనకు మూలాలు గౌరవప్రదమైన సర్దుబాట్లలోను, శాంతి ప్రియత్వంలోను అదేవిధంగా రష్యన్ విప్లవం మహిళా విముక్తికోసం చేసిన కృషిపట్ల ఎలాంటి దురభిప్రాయము లేని గుర్తింపులోను వున్నాయి. ఇది ఎలా వున్నప్పటికీ బూర్జువా మహిళా వుద్యమంలో లీగ్ ఒక చిన్న శకలం మాత్రమే.

సంఘటిత స్త్రీవాద ప్రతీఘాత విప్లవశక్తి కేవలం బూర్జువా మహిళలను కలుపుకురావడంపైనే ఆధారపడలేదు. అసంఖ్యాకమైన శ్రామిక మహిళలపై కూడా వీరి మోసపూరిత ప్రభావం పడింది. ఈ మహిళల ఆకాంక్షలు, కార్యకలాపాలు స్త్రీ, పురుషుల మధ్య పోరాటంపైనా, బూర్జువా సమాజ సంస్కరణలపైనా కేంద్రీకరించబడ్డాయి. అంతేగాని విప్లవం కోసం వర్గఘర్షణలపై కేంద్రీకృతం కాలేదు. ఈ స్త్రీ లోకాన్ని బూర్జువా మహిళా వుద్యమం విప్లవ ప్రతీఘాతశక్తిగా దిగజార్చివేసింది. ఇది తన కార్యకలాపాల ద్వారా బలోపేతమైన సంస్కరణవాద సోషల్ డెమొక్రటిక్ మహిళా వుద్యమాన్ని కూడా తన వెనుక చేర్చుకొన్నది. దీనిని మనం తక్కువగా అంచనా వేయరాదు. పెట్టుబడిదారీ విధానం విస్తరించటంతోపాటే బూర్జువా మహిళా వుద్యమం కూడా ప్రపంచవ్యాప్తంగా విస్తరించింది. ప్రాచ్యదేశాలలో సైతం స్త్రీలను అంతకంతకూ ఆకర్షించగలిగింది. ఎక్కడైనా గాని అణగారిన, దోపిడీకి గురవుతున్న వర్గాలు సామ్రాజ్యవాద పెట్టుబడిదారీ విధానానికి వ్యతిరేకంగా నిలిచినప్పుడు భ్రమలు కల్పించడం ద్వారా, శ్రామిక మహిళలను, వారి సోదరులు సాగిస్తున్న విప్లవ పోరాటానికి దూరంగా నిలపటం ద్వారా సామ్రాజ్యవాదాన్ని రక్షించటానికి బూర్జువా మహిళా వుద్యమం ముందుకు వస్తుంది. లక్షోపలక్షలమందిని అది తన వెనుక చేర్చుకొన్నది. అల్పిష్టి లాభాలు కల్గించే పెట్టుబడి సమాఖ్యలకు, కార్మికసంఘాలకు, వృత్తి యూనియన్లకు మాత్రమే లోబడి వుండాలని, దృఢమైన నమ్మకం కలిగివుండాలని బోధించే విద్యాసంస్థలు కూడా దానివెనుక వున్నాయి. కాగా బూర్జువా వ్యతిరేకభావాలు, కార్యకలాపాలు పెరగకుండా అడ్డుకట్టవేసేటందుకు సంక్షేమ సమాఖ్యల కార్యకలాపాలు తోడ్పడేవి. ఇవి తప్పుడు ప్రచారం చేస్తూ వేలాదిమందితో కూడిన సమరశీలవాదులను తన అదుపులో వుంచుకొనేది. ప్రభుత్వ, ప్రైవేటు నిధుల నుంచి వీటికి ఆర్థికపుష్టి సమకూరేది. బూర్జువా మహిళా వుద్యమం విప్లవ ప్రతీఘాత స్వభావానికి తిరుగులేని వుదాహరణ ఏమిటంటే ఇటలీ, పోలెండ్, జర్మనీ, అమెరికా తదితర దేశాలలోని ఫాసిస్టు మహిళా సంఘాలే. క్లుప్తంగా చెప్పాలంటే బూర్జువా మహిళా వుద్యమం తీవ్రమైన, ప్రమాదకరమైన విప్లవ ప్రతీఘాతశక్తి. దీనితో ఎలాంటి రాజీగాని, పొత్తులుగానీ వుండవు. దీనిని ఓడించవలసి వుంది. ఆ రకంగానే కార్మికవిప్లవం జయప్రదమవుతుంది. చారిత్రకశక్తులు దాని విజయాన్ని ఖరారు పరిచాయి.

oooooo